

	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6: 31	5:11
నంద్యాల	6: 28	5:11

పరవశించిన మంత్రాలయం

- రాఘవరాయలకు స్వర్ణకవచ సమర్పణ సేవ
- ఘనంగా సాగుతున్న గురు వైభవోత్సవాలు
- ప్రముఖులకు అవార్డులు అందజేసిన పీఠాధిపతి



భరతనాట్యం చేస్తున్న కళాకారిణి అన్విత ప్రియ

మంత్రాలయం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాల్లో మూడో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను తలపై పెట్టుకుని తన గురుభక్తిని చాటుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం పులకరించింది. రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసిఅర్చన, విశేష పంచామృతాభిషేకం, అక్షోదకం చేశారు.

బంగారు, వెండి ఆభరణాలతో పాటు స్వర్ణ కవచసేవ సమర్పణ, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. మూలరాములకు కనకాభిషేకం చేశారు. అంతకుముందు గ్రామదేవత మంచాలమ్మకు విశేష మంగళహారతులు ఇచ్చారు. వెండి గజవాహనంపై బంగారు అంబారిలో సుందరంగా తీర్చిదిద్దిన ప్రహ్లాదరాయలను అధిష్టించి చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించి ఊంజల సేవ చేశారు.



మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



ప్రముఖులకు అవార్డులు : మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రముఖులకు గురు వైభవోత్సవ-2025 అవార్డులను ప్రదానం చేశారు. బళ్లారి ఎస్పీ శోభారాణి, ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి, గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, ప్రొఫెసర్ జయదేవ్, డాక్టర్ నాగరాజుశెట్టి, విద్వాన్ ఇంద్రకాంతి ప్రసాద్‌శర్మ, పూణే ప్రొఫెసర్ గురురాజ కులకర్ణిలకు పీఠాధిపతి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితకేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి, మాజీ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, వాదిరాజాచార్, అనంతపురాణిక్, రవి కులకర్ణి, విజేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు : యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన వైష్ణవి నాట్యశాల, అన్వితప్రియ చేసిన నాటక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా బెంగుళూరుకు చెందిన ప్రహ్లాదాచార్ బృందం నిర్వహించిన పిల్లనగ్రోవి, మ్యాజిక్‌షో, నృత్యప్రదర్శనలు అలరించాయి.







వెండి గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు, బళ్లారి ఎస్పీ శోభారాణికి అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి



ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి నాగభూషణంకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి



కేఎంసీ విద్యార్థులకు ర్యాంకుల పంట

- ప్రతిభ చాటిన కర్నూలు మెడికల్ కాలేజీ పీజీ వైద్యులు
- రాష్ట్ర స్థాయిలో నలుగురు ప్రథమ.. ఆరుగురు ఐదులోపు ర్యాంకులు



కర్నూలు హాస్పిటల్/ కర్నూలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ) పీజీ విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల పంట పండించారు. చదువుకున్న కళాశాలకు.. వైద్యవిద్య అధ్యాపకులు గర్వపడేలా కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చారు. జూనియర్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. ఏదో ఒక విభాగంలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం సహజం. ఏకంగా ఏడు విభాగాల్లో పది మంది పీజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఐదులోపు ర్యాంకులు సాధిస్తే.. వారిలో నలుగురు ప్రథమ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ)ని 1954లో స్థాపించారు. 50 మంది వైద్య విద్యార్థులతో 1956 జూలైలో తొలి ఎంబీబీఎస్ బ్యాచ్ ప్రారంభమైంది. 1957లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) వైద్య విద్యను ప్రారంభించారు. ప్రస్తుతం ఎంబీబీఎస్‌లో 250 సీట్లు, పీజీలో 175 సీట్లు ఉన్నాయి. అప్పటి నుంచి నేటి వరకు వరకు వేలాది మంది వైద్యులను తయారు చేసిన ఘనత కేఎంసీకి ఉంది. అంతటి ఘనచరిత్ర కలిగిన కర్నూలు మెడికల్ కాళాశాలలో వివిధ విభాగాల్లో పీజీ చేసిన విద్యార్థులు తుది పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల పంట పండించారు. గురువుల చేత ప్రశంసలు అందుకున్నారు.

ఆరుగురికి ప్రథమ ర్యాంకు

కేఎంసీలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గుండె సంబంధిత జబ్బులు, గైనిక్, ఆర్థో, ఊపిరితిత్తులు.. ఇలా 36 విభాగాల్లో 175 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) వైద్య విద్యాభాసం చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులకు ఫైనల్ ఇయర్ డిసెంబరులో తుది పరీక్షలు, జనవరిలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 28న ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఫలితాలు విడుదల చేసింది. సోమవారం సాయంత్రం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ విభాగాలు వారీగా ర్యాంకులు ప్రకటించారు. జనరల్ సర్జరీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు కేఎంసీ విద్యార్థులు సొంతం చేసుకోవడం కొసమెరుపు. ఇది ఓ చరిత్ర అని బోధన సిబ్బంది పేర్కొన్నారు. అలాగే ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, మైక్రోబయాలజీ, పెథాలజీ, ఫార్మకాలజీ విభాగాల్లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు. అనాటమి విభాగంలో 3వ కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో 4,5 ర్యాంకులు సొంతం చేసుకున్నారు.



రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పీజీ వైద్య విద్యార్థులను అభినందిస్తున్న అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పీజీ వైద్య విద్యార్థులు

విభాగం	విద్యార్థి పేరు	రాష్ట్ర స్థాయి ర్యాంకు
జనరల్ సర్జరీ	డాక్టర్ విష్ణుశేఖర్‌రెడ్డి	ప్రథమ
జనరల్ సర్జరీ	డాక్టర్ తేజేశ్వర్‌రెడ్డి	ద్వితీయ
జనరల్ సర్జరీ	డాక్టర్ శివనాగజ్యోతి	తృతీయ
ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ	డాక్టర్ అభినయ్	ప్రథమ
మైక్రోబయాలజీ	డాక్టర్ వైష్ణవి	ద్వితీయ
పెథాలజీ	డాక్టర్ హిమబిందు	ప్రథమ(థియరీ)
అనాటమీ	డాక్టర్ జోసిలిన్	తృతీయ
ఫార్మకాలజీ	డాక్టర్ శివరంజని	ప్రథమ(థియరీ)
కమ్యూనిటీ మెడిసిన్	డాక్టర్ ఆయేషా	నాలుగు
కమ్యూనిటీ మెడిసిన్	డాక్టర్ హారిక	ఐదో ర్యాంక్

విభాగాధిపతి ప్రోత్సాహం మరవలేనిది



మా స్వస్థలం అనంతపురం. నాన్న జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్. అమ్మ శ్రీదేవి గృహిణి. కర్నూలు మెడికల్ కాలేజీలోనే ఎంబీబీఎస్ చేశాను. నీట్‌లో ర్యాంకు సాధించి ఇదే కాలేజీలో జనరల్ సర్జరీ పీజీ సీటు దక్కించుకున్నాను. ప్రధానంగా మా విభాగాధిపతి డాక్టర్ హరిచరణ్, బోధన సిబ్బంది ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించాను. సూపర్ స్పెషాలిటీలో సర్జికల్ అంకాలజీ పూర్తి చేసి అనంతపురం జిల్లా ప్రజలు సేవలు అందిస్తాను.

- డాక్టర్ విష్ణుశేఖర్ రెడ్డి, స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జనరల్ సర్జరీ విభాగం

ప్రణాళికాబద్ధంగా చదివాను



పీజీ వైద్య విద్యార్థులుగా ఓ వైపు సాధన.. మరో వైపు రోగులకు సేవలు చేస్తూ ప్రణాళికాబద్ధంగా చదవడంతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధ్యమైంది. హెచ్‌ఓడీ డాక్టర్ సాయిసుధీర్, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ ఆరు నెలలు ముందు నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. రోజులో ఎక్కువ సమయం చదువుకోవడానికి కేటాయించాం. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే అనుకున్నది సాధించవచ్చు.

- డాక్టర్ అభినయ్, స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ

సబ్జెక్టులపై ప్రతి నెలా పరీక్షలు



వైద్య రంగంలో రాణించాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంగా కష్టపడ్డాను. మా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రాజేశ్, అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మీకామేశ్వరి ప్రోత్సాహం, బోధన ఎంతో ఉపయోగపడింది. మాకు ప్రతి నెలా టెస్టులు నిర్వహించి మా ప్రతిభ ఏ స్థాయిలో ఉందో గుర్తించి పలు సూచనలు చేసేవారు. ఆ సూచనలతోనే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాం.

- డాక్టర్ శివరంజని, స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఫార్మకాలజీ విభాగం

నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అదే విధంగా రీఓపెన్ అయిన అర్జీలపై కూడా దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కలెక్టరేట్‌లో ఉన్న ఆయా కార్యాలయాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాల కిటికీల్లో నుంచి ఖాళీ వాటర్ బాటిల్స్, టీకప్పులు, బయటికి పడేసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల 3 వ శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛతా దివస్ కార్యక్రమాలను నిర్వహించుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతుంటే కలెక్టరేట్‌ను శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్తి ధర క్వింటా రూ.7,535

ఆదోని అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,535 పలికింది. గతవారం నుంచి పత్తి ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇప్పటికే చాలా మంది రైతులు 80 శాతం పైగా తమ పత్తి దిగుబడులను విక్రయించుకున్నారు. కొంతమంది ధర తక్కువగా ఉందని రైతులు ఇళ్లలో నిల్వ ఉంచుకున్నారు. సోమవారం 1,074 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,580, గరిష్ఠ ధర 7,535, మధ్యస్థంగా ధర రూ.7,369 పలికింది.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా వెల్లడి

అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాలలోని పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుల ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ ఆధారంగా రూపొందించిన జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు సోమవారం డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే పదో తేదీలోగా డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటరులో అభ్యంతరాలను కడప ఆర్జేడీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో పది మంది డీబార్

36 మంది గైర్హాజర్




కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో సోమవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన పది మంది విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. వారిని డీబార్ చేశారు. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,506 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 20,160 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 336 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడి పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఆరుగురు, పత్తికొండ ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఒకరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నన్నూరు కాలేజీ పరీక్ష కేంద్రాల్లో ఒక్కొక్కరి చొప్పున మాల్ ప్రాక్టీసు నమోదు చేసినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 10,888 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 984 మంది హాజరుకాగా, 104 మంది గైర్హాజరయ్యారని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు ఎలాంటి మాల్ ప్రాక్టీసు నమోదు కాలేదని తెలిపారు.

ఇక జాగ్రత్త



అంతకుమించి..


హెల్మెట్ లేకపోతే రూ.వెయ్యి జరిమానా


డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10వేలు


కారులో అందరూ సీట్ బెల్టు పెట్టుకోవాల్సిందే


సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.10వేలు

ఆదోని, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఏపీ హైకోర్టు ఇటీవల విచారణ నిర్వహించింది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలుకు శ్రీకారం చుట్టింది. ట్రాఫిక్‌ను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై భారీగానే జరిమానా విధించనున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి రూల్స్ మారాయి. ఇక నిబంధనలు అతిక్రమిస్తే భారీగానే జరిమానా చెల్లించుకోక తప్పదు. మార్చి ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మోటారు వెహికల్ చట్టం అమలు చేశారు. నూతన నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి. హెల్మెట్ లేకపోయినా, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోయినా భారీ జరిమానా విధించనున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. అంతేకాదు బైక్ వెనుక వైపు కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించకుంటే కూడా రూ.వెయ్యి ఫైన్ వేస్తారు. ఇక ఇన్సూరెన్స్ లేకుంటే రూ.2వేల నుంచి రూ.4 వేల వరకు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఏకంగా రూ.5వేలు జరిమానా, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.1,500 వరకు జరిమానా విధిస్తారు. ఆటో, లారీ డ్రైవర్లు యూనిఫాం ధరించకపోతే రూ.150 నుంచి రూ.300 వరకు ఫైన్ కట్టాల్సిందే. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఇప్పటివరకు రూ.1,500 ఉన్న జరిమానాను ఏకంగా రూ.10వేలకు పెంచారు. కారులో ప్రయాణించే వారికి కూడా నిబంధనలను కఠినతరం చేశారు. కారు డ్రైవర్‌తో పాటు, ప్రయాణికులు సీట్ బెల్టు ధరించకుంటే ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా విధిస్తారు. అతివేగంతో వాహనం నడిపినా, బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసినా రూ.వెయ్యి జరిమానా ఉంటుంది. కారు, బైక్ రేసింగ్‌లకు పాల్పడితే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది.


తనిఖీలు చేస్తున్న అధికారులు

వాట్సా‌ప్‌లో టెన్త్ హాల్ టికెట్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వాట్సాప్ ద్వారా కూడా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు తమ హాల్ టికెట్లను వాట్సప్ మనర మిత్ర ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 3వతేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి వారి స్కూల్ లాగిన్ నుంచి కాని, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ మనమిత్ర ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ప్రధానోపాధ్యాయులు హాల్‌టికెట్‌లోని విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫొటో, సంతకం వంటి అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించాలని ఆదేశించారు. విద్యార్థి వివరాలు సరిగా లేకపోతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ మెయిల్ ద్వారా కాని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల దృష్టికి గాని తీసుకెళ్లాలని తెలియజేశారు.

వాట్సాప్ ద్వారా ఇలా..


1. వాట్సాప్ నుంచి 9552300009 అనే నంబర్‌కు 'హాయ్' అని పంపాలి.
2. 'సేవను ఎంచుకోండి' అని రాగానే తెలుగులో అయితే 'విద్యాసేవలు' ఇంగ్లీష్‌లో అయితే 'ఎడ్యుకేషన్ సర్వీస్'ను ఎంపికచేసుకోవాలి.
3. ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్‌ను ఎంపిక చేసుకుని అప్లికేషన్ నంబర్ లేదా విద్యార్థి ఐడీ, పుట్టినతేదీ సంవత్సరం, నెలతో సహా వివరాలు నమోదు చేయాలి.
4. తర్వాత ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్‌ను పొందేందుకు కన్ఫర్మ్ మీద క్లిక్ చేయాలి. వెంటనే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. ప్రింట్ తీసుకుని పరీక్షా కేంద్రానికి వెళ్లవచ్చు.

తెలుసుకుందాం

సహాయానికి ఫోన్ నెంబర్లు

మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు ఎక్కడైనా ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటే తక్షణ సహాయం కోసం పోలీసులతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌కు - 1098
ఉమెన్ హెల్ప్‌లైన్ - 181
పోలీస్ హెల్ప్‌లైన్ - 100 / 112
సైబర్ క్రైం హెల్ప్‌లైన్ - 1930
నంద్యాల పోలీసు కంట్రోల్ రూమ్ (వాట్సాప్ నెంబర్) 91548 78120
ల్యాండ్ నెంబర్ - 08514 - 225097



మహిళలకు రక్షణ

- మహిళల భద్రతకు పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం

నంద్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో మహిళలు, విద్యార్థినులపై వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ పరిణామాలు అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కవచంలా నిలిచేందుకు జిల్లా పోలీసులు నడుం బిగించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలు చేపట్టనున్నారు. కర్నూలు ఎస్పీ, నంద్యాల ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ ఆదేశాల మేరకు మహిళల రక్షణ, భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్నారు. ఈ తరహా కార్యక్రమాలను ఈ నెల 8వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించనున్నారు. మహిళలకు సంబంధించిన అంశాలపై పోటీలు, మెడికల్ క్యాంప్‌లు, ర్యాలీలు చేపట్టనున్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సందర్శించండి.. తెలుసుకోండి..!

ఓపెన్ హౌస్‌లో భాగంగా మహిళలు, యువతులు, విద్యార్థినులను పోలీస్ స్టేషన్లకు ఆహ్వానించి పోలీస్ విధులు, మహిళా సహాయ కేంద్రం పనితీరు, అధికారుల పనితీరు, విధినిర్వహణలో ఉపయోగించే పరికరాలపై అవగాహన, విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేయడం, మహిళలు, యువతులు, చిన్నారుల రక్షణకు రూపొందించి అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పోలీసులు కల్పించనున్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో యాక్టులతోపాటు సామాజిక మాధ్యమాల వినియోగం, వాటి దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు బాలికలు స్వీయరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు.

విద్యార్థి కుటుంబానికి చెక్కు అందజేత


శ్రీలేఖ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈవో.

సి. బెళగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి శ్రీలేఖ కుటుంబానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు డీఈవో శ్యామ్యూల్‌పాల్ రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఆ కుటుంబంలోని మిగతా ఇద్దరు విద్యార్థులను ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేర్పించి చదివిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీలేఖ చిత్రపటానికి పులమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న చెట్ల కింద విద్యార్థులను చదివించడం, కుర్చోబెట్టడం చేయరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమా, స్కూల్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ ఎల్లెల్సీ చైర్మన్ చిన్న కొండయ్య, నరసింహుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి

పాణ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలపనూరు గ్రామంలో యేలంపల్లి రాంమోహన్‌రెడి (63) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు నంద్యాలకు పెళ్లికి వెళ్లడంతో.. పురుగుల మందు తాగాడు. దీంతో సమీపంలోని గ్రామస్తులు హుటాహుటిన నంద్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత పదేళ్లుగా పది ఎకరాలు కౌలు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. దాదాపు రూ.40 లక్షల అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు గంగాధర్‌రెడ్డి, భార్య వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని తెలిపారు.


రాంమోహన్ రెడ్డి (ఫైల్)

ట్రాక్టర్ నుంచి కిందపడి ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నుంచి జారి పడి ఒకరు మృతి చెందిన సంఘటన ఆదోని మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఇదే ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదోనికి చెందిన వెంకటేశ్వర్లు(45) కూలి పనులు చేసుకునేవారు. రోజువారి పనుల్లో భాగంగా ఆయన ఆదోని మండలం విరూపాపురం గ్రామంలో ఓ మఠం నిర్మాణానికి ట్రాక్టరులో బండలను తీసుకొచ్చారు. అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా సోమవారం రాత్రి పది గంటల సమయంలో విరూపాపురం గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో వాహనం అదుపు తప్పింది. దీంతో వెంకటేశ్వర్లుతో పాటు మరో కూలి కుమార్ ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. వెంకటేశ్వర్లు తలపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య గౌతమి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. గాయపడ్డ కుమార్‌ను తోటి కూలీలు ఆసుపత్రికి తరలించారు.

సెట్కూర్ సీఈఓగా వేణుగోపాల్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సెట్కూర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ)గా డాక్టర్ కె.వేణుగోపాల్ నియమితులయ్యారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను కర్నూలు జిల్లా యువజన సర్వీసుల శాఖ మరియు పర్యాటక, సాంస్కృతిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలం పాటు ఆయన పదవిలో కొనసాగుతారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో ఈనెల 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టిగ్ పోటీలు జరి గాయి. జిల్లా లిఫ్టర్లు 18 పతకాలు సాధించారు. డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో విజేతలైన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ చైర్మన్ రామ్‌గోపాల్ అభినందించారు. విజేతలకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేశ్, జట్టు మేనేజర్ రేష్మా, పీఈటీ భాగ్య లక్ష్మి, ఉపాధ్యక్షులు మునుస్వామియా, అధ్యక్షుడు వేణుగోపాల్ విజేతలకు అభినందనలు తెలిపారు.

కలుషిత నీటి వల్లే మరణాలు..!

- కర్నూలు రీజనల్ సెంటర్ నుంచి వెల్లడైన నీటి నమూనాల నివేదిక
- నీలితొట్లవీధిలోని ఆర్వో ప్లాంట్ నమూనాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా
- వెంటనే ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేసిన అధికారులు

ఆత్మకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటి వల్లే ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధిలో ఇద్దరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 27వ తేదీన నీలితొట్ల వీధికి చెందిన రహంతుల్లా(50), బషీరూన్ (60)తో పాటు మరికొందరు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆత్మకూరులోని ఆసుపత్రులను ఆశ్రయించారు. అయితే వీరిలో రహంతుల్లా, బషీరూన్ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వారిని కర్నూలుకు తరలించగా అక్కడ వారు కోలేకోలేక మరణించారు. దీంతో రాత్రికి రాత్రి అప్రమత్తమైన అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన నీలితొట్ల వీధిలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. అన్ని తాగునీటి పైపులైన్లను పరిశీలించారు. పైపులైన్ల ద్వారా ఎక్కడా నీటి కలుషితం లేదని ప్రాథమికంగా గుర్తించారు. మార్చి 1వ తేదీన కాలనీలోని రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌ను గుర్తించి అందులో ఫిల్టర్ చేసిన వాటర్‌తో పాటు రా వాటర్ నమూనాలను సేకరించి కర్నూలులోని రీజనల్ ల్యాబ్‌కు పంపించారు. అయితే సేకరించిన నీటి నమూనాల నివేదికలో సోమవారం పలు వాస్తవాలు వెలుగు చూశాయి. బిస్మిల్లా వాటర్ ప్లాంట్ నీటి నమూనాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. ఈ బ్యాక్టీరియా రా వాటర్‌లోకి చేరినట్లు గుర్తించారు. ఈ కలుషిత నీటిని సేవించడం వల్ల నీటితొట్ల వీధిలో అతిసార ప్రబలేందుకు కారణమని తెలుస్తోంది.

ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేసిన అధికారులు

నీటి నమూనాల పరీక్షల్లో వెల్లడైన నివేదికలతో నీలితొట్ల వీధిలో కలుషిత నీటికి కారణమైన బిస్మిల్లా వాటర్ ప్లాంట్‌ను సోమవారం సాయంత్రం అధికారులు సీజ్ చేశారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబులు వాటర్ ప్లాంట్ యజమాని ఖుర్షిద్‌కు నోటీసులు జారీ చేసి వాటర్ ప్లాంట్‌ను మూసివేశారు. ఇంకా పట్టణంలోని సుమారు 19 వాటర్ ప్లాంట్లకు సంబంధించి నీటి నమూనాలను కూడా మున్సిపల్ అధికారులు సేకరించారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా వాటిని కూడా రీజనల్ ల్యాబ్‌కు పంపించగా త్వరలోనే ఆ రిపోర్టులు కూడా రానున్నాయి. అదే క్రమంలో కాలనీకి పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేపట్టకుండా ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే 24 గంటలపాటు కాలనీలో వైద్యసేవలను అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలను చేపడుతున్నారు. అలాగే యుద్ధప్రాతిపదికన కాలనీలోని పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.


సోమవారం నీలితొట్లవీధిలో పర్యటించిన అధికార యంత్రాంగం

న్యాయం చేయాలంటూ

పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



ఆందోళన చేస్తున్న బాధితులు

చాగలమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని న్యూ బిల్డింగ్స్ వీధిలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జనని మ్యాక్స్ లిమిటెడ్ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేశారు. డబ్బులు చెల్లిస్తే వడ్డీతో పాటు మూడు రెట్లు అదనంగా చెల్లిస్తామంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి రూ.40 లక్షలు దాకా డబ్బు కట్టించుకొని కాలయాపన చేస్తున్నారని సోమవారం ఆ సంస్థ కేంద్రం ముందు బాధితులు ఆందోళన చేపట్టారు. తాము చెల్లించిన సొమ్ముకు మూడు రేట్లు అదనంగా చెల్లిస్తామని మోసం చేశారని బాధితులు వాపోయారు. నెల రోజుల నుంచి డబ్బుల కోసం తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. చాగలమర్రిలో రూ.10 లక్షలు, బ్రాహ్మణపల్లెలో రూ.30 లక్షలు దాకా బాధితులు చెల్లించామన్నా రు. సంస్థ మేనేజర్ కేంద్రానికి రాకపోవడంతో బాధితులు కట్టిన డబ్బులు వస్తాయో లేదోనని ఆవేదన చెందుతున్నారు. న్యాయం చేయాలంటూ బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి విచారణ జరిపి డబ్బులు వచ్చేలా చూస్తామని పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని కొండవీటి ప్రాంతానికి చెందిన యుయు సందీప్ (25) అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కొండవీటి ప్రాంతవాసి సందీప్ బైక్ మెకానిక్‌గా జీవిస్తున్నాడు. బైక్ మెకానిక్ పనుల వల్ల వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోవడం, సంతానం కలగకపోవడం వల్ల మనస్తాపం చెంది ఆదివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పరిశీలించి తెలపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారాను సమూలంగా నిర్మూలించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటుసారాను నిర్మూలించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయం 2.0పై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి, సరఫరా వంటి సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నెం.14405ను కాల్ చేసి తెలియజేసి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడంలో తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఇంద్రకరణ్ తేజ, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులో చోరీకి విఫల యత్నం

ఎమ్మిగనూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న కెనరా బ్యాంకు (ఓల్డ్ సిండికేట్ బ్యాంకు)లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి ఓ దొంగ కిటికీని పగులగొట్టి బ్యాంకులో చొరబడ్డాడు. లోపల కౌంటర్ దగ్గర డబ్బు లభించకపోవడంతో బ్యాంకులో ఉన్న సేఫ్ లాకర్ దగ్గరకు వెళ్లి లాకర్ తెరిచేందుకు యత్నించాడు. అయితే అది తెరుచుకోకపోవడంతో చేసేదిలేక పక్కనే ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న టీ స్టాల్‌లోని డబ్బుల కౌంటర్‌ను పగులగొట్టి అందులో ఉన్న రూ.1500 దోచుకెళ్లాడు. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బ్యాంకును పరిశీలించారు. నగదు చోరీకి గురికాకపోవడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి ఒడిసా వాసి మృతి

తుగ్గలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న రథియా బాడెక్ (33) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం మండల పరిధిలోని లింగనాయనదొడ్డి రైల్వేస్టేషన్ సమీపంలో వెళ్తున్న రైలు నుంచి కింద పడి ఒడిసాకు చెందిన రథియా బాడక్ మృతి చెందాడు. డోన్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించారు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డ ద్వారా మృతుడు వివరాలు తెలుసుకున్నారు. ఆయన ఒడిసా నుంచి గడక్ వెళ్తున్నట్లు తెలిపారు. మృతుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి పడ్డాడా? లేక ఎవరైనా వెనుకనుంచి తోసేశారా? అనే అనుమానం నివృత్తి కావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 170 మంది హాజరు

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ పరీక్షలకు 207 మంది దరఖాస్తు చేసుకోగా 170 మంది హాజరైనట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ వర్సిటీ పరిధిలోని 14 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి: కమిషనర్



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అర్జీలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ శోభన్‌బాబు, ఆర్‌ఓ జునైద్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి మహాప్రభో: పాతబస్టాండు ఎర్రబురుజులో తమ ఇంటి ముందు అనధికారింగా ఇంటిని నిర్మించుకుని తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమ కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని శశికళ అనే మహిళ కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ తమ ఇంటి ముందు ఓ వ్యక్తి అనధికారిం గా ప్రభుత్వ రోడ్డుని ఆక్రమించుకుని ఇంటిని నిర్మించుకోవడమే కాకుండా తాము ఇంటి నుంచి బయటికి రావడానికి దారి లేదని దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

● నగరంలో దుకాణాల వద్ద పరిసరాలను శుభ్రంగా లేకుంటే సంబంధిత దుకాణదారుడే బాధ్యత తీసుకోవాలని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం తెల్లవారుజామున కమిషనర్ పాత బస్తీ, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలను తనిఖీ చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి

గూడూరు మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి శివ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం జాతీయ పశువ్యాధి నియం త్రణ కార్యక్రమంలో భాగంగా గూడూరులోని పశువైద్యశాలలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి సోకిన పశువులలో పని చేసే సామర్థ్యం తగ్గుతుందని, అలాగే పాడి పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ధనుంజయ ఆచారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణపై అవగాహన

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 3(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని అటవీ సంరక్షణాధికారులు లక్ష్మయ్య, ఓబులేసు అన్నారు. సోమవారం దిన్నేదేవరపాడు సమీ పంలోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినాన్ని పుర స్కరించుకుని ఫారెస్టు రేంజ్ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల కు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని చేయడం వల్ల మనిషి మనుగడకు కూడా ప్రమాదం వాటిల్లుతోందన్నారు. అడవుల పెంపకంతోపాటు, వాటిని సంరక్షించుకో వాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంఘమిత్ర యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి మహ్మద్ ఇద్రూస్ మాట్లాడుతూ సర్పాలన్నీ హానికరమైనవి కావ న్నారు. అనంతరం విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు రేణుక, శకుంతల, రామచంద్రుడు, నగేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని రాష్ట్ర ఎస్సీసెల్ చైర్మన్ సి.అనిల్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనన్ను జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బజారన్నతోపాటు జిల్లా నాయకులు కలిసి శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి నేడు వాటిని తుంగలో తొక్కారని మండి పడ్డారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం, విద్యార్థు లకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు రంజాన్ తోఫా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించండి

సి.బెళగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కాశీంను తొలగించాలని కూలీలు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలు భాస్కర్, సురేష్, ఎర్రన్న, మద్దిలేటి, హనుమంతు మాట్లాడుతూ పనులకు హాజరైన మస్టర్‌లో హాజరు వేయకుండా తమ వేధిస్తున్నా రన్నారు. ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగించకుంటే మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నివారణకు వ్యతిరేకంగా కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

క్రిష్ణగిరి తహసీల్దార్‌పై విచారణ జరపాలి: షెడ్యూల్ కులాలకు కేటాయించిన ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడిన అక్రమార్కులకు వెనుదన్నుగా వ్యవహరిస్తున్న క్రిష్ణగిరి తహసీల్దార్‌పై విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. క్రిష్ణగిరి మండలం అమకతాడు రెవెన్యూ పరిధిలోని మాదాపురం గ్రామంలో ప్రభుత్వ అసైన్మెంట్ కమిటీ ద్వారా సర్వే నెం.759/ఏ1/700/1 విస్తీర్ణం 43 ఎకరాల 23 సెంట్లు భూమి 13 మందికి షెడ్యూల్ కులాలకు కేటాయించిందన్నారు. ఆ భూములను ఉన్నత కులాల వారు రాజకీయ బలంతో అక్రమంగా రెవెన్యూ అధికారుల సహకారంతో అడంగల్, 1బి నమోదు చేయించుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గోవిందు గిడ్డయ్య, శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి: క్రిష్ణగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకుల రాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు రోజువారిగా అందించాల్సిన మెనూను ఏ మాత్రం అమలు చేయడం లేదన్నారు. నాసిరకం సరుకులతో ఆహారం వండి చాలీచాలని విధంగా విద్యార్థులకు వడ్డిస్తున్నారన్నారు. సీట్ల పేరుతో తల్లిదండ్రుల దగ్గర వేలాది రూపాయలను ప్రిన్సిపాల్ వసూలు చేస్తున్నట్లు గతంలో ఆరోపణలు ఉన్నాయన్నారు.

హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి: తెలంగాణాలో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు కలెక్టర్ రంజిత్‌బాషాకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి చెందిన హోంగార్డులు తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవాల్సి వచ్చిందన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

కల్లూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.నిర్మల, పీఎస్.రాధాకృష్ణ కోరారు. సోమవారం సీపీఎం నాయకుడు ఎండీ ఆనంద్ బాబు, టి.రాము డు, ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలు కల్లూరు సర్వే నెంబర్ 70-2లోని ప్రభుత్వ భూమిలో జెండాలు పాతారు. అక్కడ కంపచెట్లు తొలగించి ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులు తహసీ ల్దారు కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలన్నారు. దీంతో సీపీఎం నాయకులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో గురుశేఖర్, నగేష్, అలివేలమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

● **తహసీల్దారు కార్యాలయం ముట్టడి:** 28వ వార్డు దూపాడు గ్రామ ప్రజలకు శుద్ధజలం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. దూపాడు ప్రజలకు హంద్రీనది నుంచి వచ్చే నీరు కలుషితమవుతుందని సోమవారం సీపీఎం మండల కార్య దర్శి కృష్ణ, మధు ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దూపాడు కార్పొరేషన్‌లో వీలిమైనా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలయ్యారన్నారు. దూపాడులో రెండు కళాశాలల నుంచి మురుగు నీరు హంద్రీలో చేరి గ్రామానికి నీరు అందించే బావుల సమీపంలో ఇంకి పోయి కలుషితమవుతున్నాయన్నారు.. అనంతరం కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, సాయి ఉదయ్, హరిబాబు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

శేషవాహనంపై రంగనాథస్వామి



స్వామి అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనింపజేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మామిదాలపాడులోగల గోదాదేవి సమేత శ్రీరంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకులం)లో ఆరంభమైన దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామ, విష్ణు సహస్రనామ పారాయణాలు, ఉదయం శేషవాహన సేవ, రాత్రి కల్పవృక్ష వాహన సేవ చేపట్టారు. ఉదయం ఆలయ అర్చ కులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషా చార్యుల ఆధ్వర్యంలో ప్రాతః ఆరాధన, అర్చనలు, సేవాకాలం, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిజీ, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామిజీ, శఠగోప రామానుజ జీయర్ స్వామిజీలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గోకులం సభ్యు లు పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

దోబీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సాయిబాబా

కర్నూలు న్యూసిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కర్షక భవన్‌లో సి.రాముడు అధ్యక్షతన సంఘం న్యూ సిటీ ఆరో మహాసభ నిర్వహించారు. సభకు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ రజకులకు ఇస్తానన్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలని, రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో పాతబస్తీ అధ్యక్షురాలు జయమ్మ, చిన్నవ్యాపారుల సంఘం నగర కార్యదర్శి మహ్మద్ రఫి, ప్రధాన కార్యదర్శి సి.శేషాద్రి, మద్దిలేటి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వాల్మీకి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భవానీ ప్రసాద్ తదితరులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ సంక్షేమ సంఘం క్యాలెండర్-2025ను బీసీ భవన్‌లో రిటైర్డు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని ప్రసాద్, హోంగార్డు రాయలసీమ కమాండెంట్ ఎస్పీ మహేష్ కుమార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ, వెటర్నరీ ఏడీ మల్లన్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకుల అభ్యున్నతికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తలారి కృష్ణ, గౌరవాధ్యక్షుడు సత్రం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుంపటి కృష్ణ, మహిళా అధ్యక్షురాలు వీరమ్మ, రవిశంకర్ శివశంకర్, కృష్ణ, చిత్ర సీనుడు పాల్గొన్నారు.

సౌత్ జోన్ షూటింగ్ బాల్ విజేతగా ఏపీ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. సీనియర్ పురుషుల విభాగం, జూనియర్ బాలుర విభాగాల్లో బాలుర జట్టు విజేతలుగా నిలిచాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాయి. జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవగా సబ్ జూనియర్ బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు అభినందించారు. జట్టు విజయానికి కృషి చేసిన శిక్షకులు కిరణ్‌కుమార్, మురళి, మహ్మద్ యూసుఫ్ బాషా, మల్లికార్జున, హర్షవర్దన్, సుజాత, సత్య, రేణుకలను అభినందించారు. విజేతలుగా నిలిచిన జట్టు ఆగస్టులో బిహార్‌లో జరగబోయే ఆలిండియా ఇంటర్ జోనల్ షూటింగ్ బాల్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలి

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాపార రం గంలో రాణించాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ట్రేడ్ ఫెస్ట్ 2025 కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే వ్యాపార మేలకువలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డు డ్యాన్స్‌లకు అనుమతి లేదు

సి.బెళగల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలో ఈనెల 10 నుంచి 16 తేదీ వరకు జరిగే చెన్న సోమేశ్వర స్వామి జాతరలో రికార్డు డ్యాన్స్‌లకు అనుమతి లేదని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. సోమవారం పోలకల్లు చెన్న సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ పెద్దలు సీఐని కలిసి జాతర జరుపుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. సీఐ మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి పరీక్షల నేపథ్యంలో గ్రామాల్లో శుభకార్యాలయాలకు, జాతరలో రికార్డు డ్యాన్స్‌లకు అనుమతి ఇవ్వమన్నారు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఉన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

గూడూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని గుడిపాడు గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి వంశీధర్(20) అదృశ్యం కాగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. ఎస్ఐ తెలి పిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కురువ శ్రీనివాసులు కుమారుడు వంశీధర్ కర్నూలు పట్టణంలో ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిరోజు గుడిపాడు నుంచి కర్నూలు పట్టణంలోని కాలేజీకి బస్సులో వెళ్లి వచ్చేవాడన్నారు. గత నెల 28న ఉదయం 7.45 గంటలకు గుడిపాడు గ్రామం నుంచి కర్నూలులోని కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని, కాలేజీకి వెళ్లి ప్రినిపాల్‌ను విచారించగా.. కాలేజీకి వంశీధర్ రాలేదని చెప్పారని, ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

● మున్సిపల్ కార్మికుల హెచ్చరిక
● కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమవుతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ, సామాజిక భద్రత, కార్మికులకు జీతాల చెల్లింపు మున్సిపల్ శాఖకు బాధ్యత అప్పజెప్పాల న్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాములు, అయ్యారాజు, ఏసన్న, సవారి, సంజీవులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం



ఆందోళన చేస్తున్న వీఆర్‌పీఎస్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్), మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం చేస్తామని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరి సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం వీఆర్‌పీఎస్ అధ్యర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి వాల్మీకుల ఎస్టీ రిజరేష్వన్ బిల్లు ఆమోదించే కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్పీఎస్ నాయకులు రామాంజినేయులు, మురళీనాయుడు, రాఘవేంద్ర, తిరుమలేసు, చిన్నమరివీడు కేశన్న, అలూరు శివ, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్ కుక్కల దస్తగిరి, ఎమ్మిగనూరు శ్రీరాములు, బేతంచెర్ల మురళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఓర్వకల్లు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ అధికారులను ఆదేశించారు.. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏపీవో కుమార సాయినాథ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

గూడూరు మార్చి 3(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి టీడీపీ బూత్ ఇన్‌చార్జి కళ్యాణ్ రఘుబాబు కమిషనర్ రమేష్ బాబును కోరారు. సోమ వారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌ను కళ్యాణ్ రఘుబాబు ఆధ్వర్యంలో రవి కుమార్, అభిలాష్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ రఘుబాబు మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ నూతన కార్యాలయానికి అవసరమైన 45 సెంట్ల స్థలాన్ని దివంగత కళ్యాణ్ మురళీధర్, రవికుమార్, అభిలాష్, రఘుబాబు దానంగా ఇచ్చారన్నారు. ఏళ్ళు గడిచినా నగర పంచాయతీ కార్యాలయ నూతన భవనం పూర్తి కాలేదన్నారు.

వాహనాలను అడ్డుకున్న వీహెచ్‌పీ నాయకులు

కోడుమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పత్తికొండ నుంచి కోడుమూరు మీదుగా అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాలను స్థానిక విశ్వ హిందూ పరిషత్ సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. ఆవులను తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి గోవులను కర్నూలు కబేళాలకు తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోవులను రక్షించాలని పోలీసులను కోరారు. పట్టుబడిన గోవులను కర్నూలు గోశాలకు తరలించారు. నాగేశ్వర రావు, నటరాజ్, కిరణ్, వీరేష్, అరవింద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై వారోత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధ్యాపకులు

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్యవిహాల నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి తెలిపారు. సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో పోస్టర్లను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్ ఫకృనిస్సా బేగం , కళాశాల మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ ఎస్. సాజిదాబీ, సుజాత, నాగరత్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు న్యూసిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జిల్లా పాస్టర్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉద్యోగనగర్ మిలియన్ బాపిస్టు చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాస్టర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేజే. విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇజ్రాయేలు, ఉపాధ్యక్షుడిగా సదానందం, కార్యదర్శిగా వీ.జాన్ సామేల్, పబ్లిసిటీ కన్వీనర్‌గా రవికుమార్‌లను ఎన్నుకున్నారు.

వైద్య శిబిరం తనిఖీ



వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా నోడల్ ఆఫీసర్ రఘు

కోడుమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో లోకెటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తనిఖీ చేశారు. రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వైద్య శిబిరాన్ని ఏర్పాటు మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచితంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, రొమ్ము, నోటి, గర్భాశయ వంటి క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ దుర్గాదేవి వైద్యాధికారి మదన్‌శేఖర్, సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్, ప్రభావతి, నాగమణి పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

మహిళపై కోతి దాడి

మద్దికెర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్ కాలనీలో నివసించే కురువ లక్ష్మీదేవి అనే మహిళపై వానరం దాడి చేయడంతో గాయాలయ్యాయి. సోమవారం లక్ష్మీదేవి మహిళ హోటల్‌కు వస్తుండగా.. మార్గమధ్యంలో కోతి దాడి చేయడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లింది. కాలనీవాసులు మాట్లాడుతూ మా ప్రాంతంలో ఎక్కువగా కోతులు ఉన్నాయని, ప్రతిరోజు ఒక్కరి పైనా కూడా దాడి చేస్తున్నాయని కోతుల బారి నుంచి కాపాడాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడండి



కూరగాయలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు ధనుంజయుడు

మద్దికెర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించిన ఉత్పత్తులనే వాడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారనీ జిల్లా టీడీపీ కార్యదర్శి ధనుంజయుడు, ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి మల్లికార్జున, భీమరాజులు అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ రైతు సాధికారిక సంస్థ, ప్రజల భాగస్వాముల ప్రకృతి వ్యవసాయంపై పండించిన పంటలను ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 700 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నామనీ తెలిపారు. ప్రకృతి ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పేద మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి వాటిని బలోపేతం చేయాలని బీజేపీ ఉత్తర మండలం అధ్యక్షుడు బోయ మహదేవ్, కౌన్సిలర్ సురేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని కిల్చిన్ పేట్, బావజీ పేట్ లలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను నాయకులు సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. కేంద్రాలలో హాజరు తక్కువగా ఉందని, సంఖ్యను పెంచిలని, బాలింతలు, గర్భవతులకు ఇచ్చే పోషక ఆహారంలో నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, యువరాజ్ పాల్గొన్నారు.

'నాసిరకం పనులకు బిల్లులు చెల్లించరాదు'

ఆదోని టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో జరిగిన నాసిరకం పనులకు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా బిల్లులను చెల్లిస్తే సహించేది లేదని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సంతేకూడ్లూరు వద్ద నాసిరకం పనులతో జరిగిన చెరువు పనులకు సంబంధించిన బిల్లులను అధికారులు కాంట్రాక్టర్‌కు చెల్లించనున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువు పనులలో నాణ్యతపై నిపుణులతో పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈలోగా బిల్లులను చెల్లించే ప్రయత్నం చేస్తే సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. 3ఏడీఎన్8 : పీడీ వెంకట్రామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్

పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి



పీడీ వెంకట్రామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్

ఆస్పరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ కుమార్ అన్నారు. సోమవారం డ్వామా పీడీ వెంకట్రామయ్యకు వినతిపత్రం అందజేశారు. రైతులకు, కూలీలకు ప్రభుత్వాలకు అనుసంధానంగా ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేయాలని కోరారు. కూలీలు అడిగిన వెంటనే పనులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఆస్పరి మండల అధ్యక్షుడు అరవింద్ కుమార్, అంజి, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

● టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



పాఠశాలల విలీనం రద్దు జీవోను వీరభద్ర గౌడ్‌కు ఇస్తున్న ప్రత్యేక అధికారి అజయ్‌కుమార్

ఆలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విద్య అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం ఆలూరు ప్రత్యేక అధికారిగా నియామకం అయిన అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కూటమి ప్రభుత్వం రద్దు చేసిన పాఠశాలల విలీనం జీవోను అందజేశారు. మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని ప్రకటించడం హర్షణీయమన్నారు. విద్యవ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం విద్య అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. తల్లికి వందనం కూడా ప్రతి విద్యార్థికి అందిస్తామని సీఎం ప్రకటించి బడ్జెట్ కూడా కేటాయించాలని అన్నారు. ఆయన వెంట ఆలూరు ఎంఈవో-2 చిరంజీవి రెడ్డి, విద్య శాఖ అధికారులు అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశా రు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రామాంజినేయులు మాట్లాడుతూ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు, మహిళలు మలమూత్ర విసర్జ కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తుందన్నారు. ప్రాంగణంలో తాగునీటి కొళాయిలు లేవని, పందుల స్వైరవిహారంతో మురుగు,చెత్త నిల్వలతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబుబ్‌బాషా, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

మద్దికెర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోవారం పాఠశాలలో మొత్తం 138 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 7 మంది గైర్హాజరయ్యారనీ డిపార్టుమెంట్ అధికారి కిరణ్మయి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలులో పెట్టారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వినతులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, మార్చి 3, (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులను సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ, గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

రైతులను ఆదుకోవాలి



సబ్ కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు రోడ్డులోని మేకవంక ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం కోల్పోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌ను కలిసి కోరారు. రైతులు వహీద్, వెంకన్నలకు చెందిన నాలుగు లక్షల ఖరీదు చేసే పశుగ్రాసం దగ్ధమైపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి విజయ కృష్ణ, యువమోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, వెల్లాల మధుసూదన్ శర్మ, సురేష్, రమేష్ ఆచారి, శ్రీకాంత్, నగేష్, జాఫర్, ఆరిఫ్ పాల్గొన్నారు.

రెడిమిక్స్ కాంక్రీట్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టిడ్కో గృహాల సమీపంలో అనుమతులు లేకుండా రెడిమిక్స్ కాంక్రీట్ ప్లాంట్లను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజను కలిసి వినతిపత్రం అందజేశారు.

అర్జీలను పరిష్కరిస్తాం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

మద్దికెర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ హుశేన్‌సాహేబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పీజీఆర్ఎస్ వేదికకు మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన రైతులు పొలాల కొలతలు, రీసర్వే మద్దికెర నుంచి భూ సమస్యలపై వచ్చిన దరఖస్తును అందజేశారు. అర్జీలను పరిశీంచి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవశాఖ అధికారి రవి, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, ఏపీవో నర్సిరెడ్డి, హౌసింగ్ ఏఈ ఉమాకంత్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం మండలం చిలుకలడోన గ్రామం అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న సందరమ్మపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు మారుతీ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధలను పాటించకుండా ఇష్టానుసారంగా చిన్నపిల్లలకు బోజనం వడ్డిస్తున్నారు అన్నారు. కోడిగుడ్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆమెపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి స్నేహలత



ఆలూరు కేజీబీవీ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థునులతో మాట్లాడుతున్న జీసీడీవో స్నేహలత

ఆలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి స్నేహలత సూచించారు. సోమవారం ఆలూరు, ఆస్పరి కేజీబీవీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం సక్రమంగా అందించాలన్నారు. కాయగూరలు ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా చూసుకోవాలని ఎస్‌వో సుహాసినీకు సూచించారు. కూరగాయలు తాజాగా సరఫరా చేయకపోతే తన దృష్టికి తీసుకువచ్చి వెనక్కి పంపాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. సబ్జెక్టులలో సందేహాలు ఉంటే సంబంధిత సీఆర్‌టీలను సంప్రదించాలన్నారు. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రారంభమైన గ్రాండ్ టెస్టులు

● 13 వరకు పది విద్యార్థులకు టెస్టులు



నెహ్రూమెమోరియల్ పాఠశాలలో గ్రాండ్ టెస్టులు రాస్తున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి గ్రాండ్ టెస్టులు ప్రారంభమయ్యాయి. పబ్లిక్ పరీక్షల తరహాలో ఈ గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నారు. 100 మార్కులకు ప్రశ్నాపత్రం రూపొందించారు. మొదటి పరీక్ష తెలుగుతో ప్రారంభమైంది. 13వ తేదీ వరకు ఈ గ్రాండ్ టెస్టులు విద్యార్థులకు జరగనున్నాయి. వీటిని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి తెలిపారు. 17 నుంచి యధావిధిగా పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

రైతులను దగా చేస్తున్న సోలార్ కంపెనీలు



మాట్లాడుతున్న హనుమంతు

ఆలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు నియోజకవర్గంలో సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుతో చేస్తున్న భూ కొనుగోలులో రైతులను దగా చేస్తున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనుమంతు, జిల్లా నాయకులు నారాయణ స్వామి ఆరోపించారు. సోమవారం స్థానిక బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 6 న ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 గ్రామాల్లో సోలార్ ప్లాంట్ నిర్వాహకులు రైతులను మోసం చేస్తూ భూ మాయ చేస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సులో వారు చేస్తున్న మోసాలను ఎండగట్టి రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, రామకృష్ణ హాజరవుతారన్నారు. రైతులు తప్పక హాజరు కావాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కడితోటకు చెందిన నలుగురిపై పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థలం వివాదంలో పింజరి శేకన్నపై గ్రామానికి చెందిన సమీప బంధువులు పింజరి సలాం, దివాన్‌సాబ్, సక్రమ్మ, సుభాన్ ఆదివారం రాత్రి దాడి చేశారు. ఫిర్యాదుదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

ఆదోని ఐటీఐ కళాశాలకు అధ్యాపకులను నియమించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిధులతో ఆదోనిలో నిర్మించిన మైనార్టీ ఐటీఐ, వృత్తి నైపుణ్యాభివృద్ధి కళాశాలకు అధ్యాపకులను నియమించాలని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి పార్థసారధి కోరారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో ఆయన నియోజకవర్గ సమస్యలపై సభ దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో మైనార్టీ బాల బాలికలకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కళాశాల నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ స్టాఫ్‌ను కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా జారీ చేసిన జీవో 117 వల్ల రాష్ట్రంలో 2.40లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మన కూటమి ప్రభుత్వం వచ్చాక 117 జీవో రద్దు చేయడం వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు చేయడం వల్ల టీచర్ పోస్టులు పెరుగుతాయన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 122 స్కూళ్లు ఉండగా, 136 స్కూళ్లు పెరుగుతాయని, దాని ద్వారా 937 మంది టీచర్లు పనిచేస్తుండగా, 1280 మంది టీచర్ పోస్టులకు పెరుగుతాయన్నారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యాశాఖకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. జూనియర్ డిగ్రీ కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

మద్దికెర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ ఈవో వీరయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి అన్నారు. సోమవారం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను పెరవలి గ్రామంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 11 నుంచి 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. రంగనాథ స్వామి రథోత్సవం 17న ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ లయ ప్రధా న అర్చకులు రంగస్వామి, టీడీపీ నాయకులు వెంకటవర్మ, ఆంజనేయ, రామాంజులు, రాము యదవ్; మెడికల్ తిమ్మపప ఉన్నారు.

క్రిష్ణగిరి తహసీల్దార్‌పై విచారణ జరపాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులకు వెనుదన్నుగా వ్యవహరిస్తున్న క్రిష్ణగిరి తహసీల్దార్‌పై విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. క్రిష్ణగిరి మండలం అమకతాడు రెవెన్యూ పరిధిలోని మాదాపురం గ్రామంలో ప్రభుత్వ అసైన్మెంట్ కమిటీ ద్వారా సర్వే నెం.759/ఏ1/700/1 విస్తీర్ణం 43 ఎకరాల 23 సెంట్లు భూమి 13 మందికి షెడ్యూల్ కులాలకు కేటాయించిందన్నారు. ఈ భూములను ఉన్నత కులాల వారు రాజకీయ నాయకుల అండతో, రెవెన్యూ అధికారుల సహకారంతో అడంగల్, 1బి నమోదు చేయించుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గోవిందు గిడ్డయ్య, శ్రీనివవాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం..!



తహసీల్దార్ కార్యాలయంలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు శాపంగా మారింది. మండలంలోని తెర్నేకల్ రెవెన్యూ పరిధిలోని మాబాషా అనే రైతుకి చెందిన సర్వే నెంబరు 381-1లో 7 ఎకరాలు ఉండగా హంద్రీనీవా కాలువకు 27 సెంట్లు పోగా, 33 సెంట్లు తక్కుగా 6.30 ఎకరాలు రైతుకు చూపడం జరుగుతుందని,మరో సర్వేనెంబరు లో 50 సెంట్లు హంద్రీనీవా కాలువలోకి వెళ్తే, రైతుకు పరిహారం అందకుండానే రికార్డులనుండి అధికారులు తొలగించడం దారుణమని సీపీఎం నాయకులు వీరశేకర్,ఆశోక్, రైతుతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో ముందు నిరసన చేపట్టారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేకర్, మండల కార్యదర్శి మహబుబ్‌బాషా ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఉపాధి పనులకు కూలీలు రాకపోతే రాలేదని, వస్తే కూలీల వేతనం నెలల కొద్ది జాప్యం చేసి, ఉపాధి హామీ పథకాన్ని నిర్వర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు. ఉపాధి కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ,ఏపీవో రాజునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మిరెడ్డి, ఆశోక్, సుధాకర్, రవీంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

ఆలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మరకట్టు గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వన్నూరప్ప, కార్యదర్శి మల్లికార్జున కోరారు. సోమవారం ఆలూరు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద మాల మహానాడు నాయకులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి అనుమతి వచ్చేలా చూస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, మళ్ళప్ప, కృష్ణ, పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులు బాగు చేయాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

దేవనకొండ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణా రహదారులు బాగు చేయాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం డీవైఎఫ్ఐ నాయకులు బస్టాండ్ నుంచి ర్యాలీ చేపట్టి, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూసుఫ్‌బాషా, బజారి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తప్పవు

తుగ్గలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, అమ్మినా పీడీ యాక్టు నమోదు చేస్తామని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు , ఎస్ఐ సాయిప్రవీణ్ అన్నారు. సోమవారం లక్ష్మీతండాలో పలు చట్టాలపై ప్రజలకు అవాగాహన కల్పించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సారా అమ్మడం, తయారు చేయడం వల్ల అల్లర్లు గొడవలు చేయడంతో పాటు కుటుంబాలు నాశనమవుతయాన్నారు. ఈయన వెంట సిబ్బంది సర్దార్, తదితరులు ఉన్నారు.

మైనారిటీలకు ఇఫ్తార్

ఆదోని టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మండిగిరి ప్రాంతంలో ఉన్న దర్గాలో మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన మైనారిటీలకు సోమవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రార్థనల అనంతరం మైనారిటీలకు ఉపవాస దీక్షలను విరమించారు. ఆచారి వారికి దగ్గరుండి భోజనం వడ్డించారు.

పార్టీ కోసం కష్టపడిన సీనియర్లను గుర్తించండి

● మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి టీడీపీలో ఉంటూ పార్టీ కోసం, అభివృద్ధి, గెలుపు కోసం కృషి చేసిన సీనియర్లను గుర్తించి, బీసీలను ఆదుకోవాలని మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం మంత్రాలయం వచ్చిన టీడీపీ జాతీయ కార్యదర్శి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తాలుకాలోని సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశామన్నారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని అన్నారు.

రేపటి నుంచి గంజహళ్లి బడేసాహెబ్ ఉరుసు



బడేసాహెబ్ స్వామివారి దర్గా

గోనెగండ్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగు బంగారమైన గంజహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ 331 ఉరుసు మహోత్సవం ఈనెల 5 నుంచి 7వరకు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ రేపు 5న గంధం, 6న ఉరుసు, 7న స్వామివారి జియారత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పలు రాజకీయ పార్టీ ల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉరుసుకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నారని వివరించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను పోలీసు అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ, ముగ్గురు ఎస్‌లు, 160మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు వివరించారు.

బడ్జెట్ కేటాయింపులో కర్నూలుకు అన్యాయం

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే నరసన్న



మాట్లాడుతున్న నరసన్న

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపులో కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసన్న ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పశ్చిమ ప్రాంతంలో ఉన్న వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలు వలసలకు పోతున్న నివారించలేకపో యారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని అన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కే అనిఫ్, భారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసేపు, జయన్న పాల్గొన్నారు.

ఉద్యోగులను విస్మరించిన బడ్జెట్: ఎస్టీయూ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులను విస్మరించారని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ ఐఆర్ అమలు, డీఏ బకాయిలకు నిధుల కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదన్నారు. సీపీఎస్, జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్లో ఎటువంటి ప్రకటన లేదన్నారు. పాఠశాల విద్యకు గత సం వత్సరం 10.15శాతం నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్లో కేవలం 9.86 శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పి, నిధులు పెంచకుండా ఇది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బసవ రాజు, బాబయ్య, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నందవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నందవరం తహసీల్దారు కార్యాలయంలోని అధికారులతో మాట్లాడారు. రీ సర్వే ఎంత వరకు వచ్చిందని, మీ సేవల పనితీరు, రైతుల ఇబ్బందుల గురించి సమీక్షించారు. గ్రీవెన్స్‌లో ఎన్ని అర్జీలు వచ్చాయని, ఎన్ని పరిష్కరించాలని అడిగి తెలుసుకున్నారు. ఏపీ సేవ సర్వీసుల గురించి ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో డీటీలు శశిశేఖర్‌స్వామి, మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఆర్ఐ సుబ్బారెడ్డి, గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నూతన రథ చక్రాలకు విరాళం

కౌతాళం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళిగనూరు తుంగభద్ర నదితీరాన వెలిసిన రామలింగేశ్వర స్వామి నూతన రథానికి సంబంధించిన చక్రాల తయారీకి కర్నాటక రాష్ట్రం సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు రూ.3లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యుడు మణికంఠ సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్యతో కలిసి పీఠాధిపతి పాల్తూరు చెన్న వీరమహాస్వాముల వారికి అందజేసినట్లు తెలిపారు. వీరికి స్వాముల వారు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసా దాలను అందజేసి ఆశీర్వాదిం చారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

మంత్రాలయం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్. జయరాజు, అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం తహసీల్దారు రవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇళ్లలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మన్న, దేవపుత్ర హనుమంతు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు





నాగలదిన్నెలో ముళ్లకంపల మధ్య బస్‌షెల్టర్, ముగతిలో నిరుపయోగంగా..

నందవరం మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులతో కోసం నిర్మించిన షెల్టర్లు ఎందుకు ఉపయో గంలోకి రావడం లేదు. దాంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తున్నారు. మండలంలోని నాగలదిన్నె వద్ద నిర్మించిన బస్‌షెల్టర్ చుట్టు ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. అలాగే ముగతి గ్రామం దగ్గర ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకరావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముళ్లకంపల మధ్య బస్ షెల్టరు



నాగలదిన్నెలో బస్‌షెల్టర్‌ను గత ఎంపీ బుట్టరేణుకమ్మ నిధులు మంజూరు చేయడంతో నిర్మించారు. కాంట్రాక్టర్లకు కేవలం డబ్బుల కోసం తూతూ మంత్రంగా నిర్మించారు. సొమ్ము చేసుకుని పక్కకు వెళ్లారు. బస్‌షెల్టర్ చుట్టు ముళ్లకంప పెరిగింది. దాంతో ప్రయాణికులకు ఇబ్బంది మారింది.

- వహబ్, నాగలదిన్నె

రోడ్డుపైన నిలబడాల్సిందే..



ముగతిలో బస్ స్టాప్ ఉన్న లేనట్లే. అందులో సౌకర్యాలు లేవు. రోడ్డుకు మూలగా ఉండడంతో రోడ్డుపైనే నిలబడాలి. అది హైవే కావడంతో ప్రయాణికులు రోడ్డు మీద నిలబడాలంటేనే భయపడుతున్నారు. అధికారులు పట్టించుకోవాలి.

- వీరారెడ్డి, ముగతి

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం క్లస్టర్ల సమావేశంలో మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాల నుంచి పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించడంతో గద్దె దించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువగళం పాదయాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్నారు. కార్మికుల గ్రాట్యుటీ, పెన్షన్, కారుణ్య నియామకాలు తదితర సమ స్యలు పరిష్కరించాలని ఈనెల 5న చలో విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, ఇస్మాయిల్, సల్మాన్, ఖాజా పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మార్కెట్ వేలాలు

ఎమ్మిగనూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ మార్కెట్లకు నేడు వేలం పాటలు జరగనున్నాయి. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో రోజువారి మార్కెట్, వారపు సంతమార్కెట్, పశువులు, గొర్రెలు మార్కెట్ గొర్రెల కబేళా స్థానిక మాంసపు మార్కెట్ వేలం పాటలు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కమిషనర్ తెలిపారు.

కౌతాళంలో పాముల సయ్యాట



పెన వేసుకున్న పాములు

కౌతాళం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్ సమీపంలో సోమవారం రెండు పాముల సయ్యాట ఆడాయి. ఈ దృశ్యాన్ని చూసిన కొందరు ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలో పాముల సయ్యాటను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. కొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు భక్తులకు అన్నదానం చేశారు.

పోక్సో కేసు నమోదు

కౌతాళం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బాలికపై అత్యాచార యత్నం చేసినట్లు బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లపై మానసిక ఒత్తిడి సరికాదు



ఐక్యత తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మంత్రాలయం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లను మానసిక ఒత్తిడి లకు గురి చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు టీబీ భీమేశ్వరి, శ్వేత అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిలకలడోన అంగన్‌వాడీ టీచర్ ఏ తప్పు చేయలేదని ఏబీవీపీ నాయకులు పత్రికల్లో ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వాస్తవం తెలుసుకోకుండా అంగన్‌వాడీ టీచర్లపై ప్రకటనలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ప్రకటనలు చేస్తే సీఐటీయూ ఆధ్వర్యం లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రమీలమ్మ, ఇందిరా, కళ్యాణి, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడండి

మద్దికెర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించిన ఉత్పత్తులనే వాడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారనీ జిల్లా టీడీపీ కార్యదర్శి ధనుంజయుడు, ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి మల్లికార్జున, భీమరాజులు అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ రైతు సాధికారిక సంస్థ, ప్రజల భాగస్వాముల ప్రకృతి వ్యవసాయంపై పండించిన పంటలను ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 700 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నామనీ తెలిపారు. ప్రకృతి ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

జగన్ ప్రతిపక్ష హోదా కోరడం అవివేకం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ
● కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రామకృష్ణ

కౌతాళం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డికి పదవులపై ఉన్న వ్యామోహం ప్రజా శ్రేయస్సుపై లేదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తమరెడ్డి విమర్శించారు. సోమవారం కౌతాళంలో పార్టీ మండల అధ్యక్షుడు యంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటామన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం సిగ్గు చేటన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని మూడు రాజధానులు అంటూ ముక్కలు చేశాడని, జగన్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మండలానికి త్వరలో 100 పడకల ఆసుపత్రికి మంజూరు చేయించి ప్రజలకు మెరుగైన వైద్యం అందజేస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. సమావేశంలో కోసిగి మండల అధ్యక్షుడు రాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజహాళ్లిలో తాగునీటి ఇక్కట్లు

మరమ్మతులకు నోచుకోని బోరు

గోనెగండ్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామంలో తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. హంద్రీనదిలో వేసిన బోరుకు మోటార్లు బిగించి నీటిని గ్రామానికి మళ్లించేవారు. అయితే మూడు రోజులుగా బోరు మోటార్ కాలిపోయింది. దీంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఎస్సీనగర్, అరవవీధి, సుంకులమ్మ కాలనీ వాసుల నీటి ఇబ్బందులు వర్ణనాతీతం. దీనికి తోడు బుధవారం నుంచి గ్రామంలో బడేసాహెబ్ స్వామి ఉరుసు జరుగనుంది. ఈ కారణంగా గ్రామానికి బంధువులు, స్వామివారి భక్తులు వేలసంఖ్యలో వస్తారు. నీటి సమస్య తీవ్రమ వుతుంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంటువ్యాధులు సోకకుండా చర్యలు: గ్రామంలో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి ఉరుసు సందర్భంగా వేల మంది వస్తుంటారు, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి వీధులను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే భక్తులకు నీటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు.



బోరును పరిశీలిస్తున్న గ్రామ కార్యదర్శి

నదికైరవాడిలో రీ సర్వే



సర్వే చేస్తున్న మండల సర్వేయర్ అక్బర్‌బాషా

నందవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో సోమవారం మండల సర్వేయర్ అక్బర్‌బాష, రీ సర్వే డీటీ మహేష్ ఆధ్వర్యంలో రీ సర్వే చేశారు. రైతులకు ముందుగానే నోటీసులు జారీ చేసి వారి పొలాల్లో సర్వే నిర్వహించారు. ఆంజినేయస్వామి మాన్యం భూమిని కూడా సర్వే చేశారు. రైతులకు ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా హద్దులు ఏర్పాటు చేశారు. ఏవైనా భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు ముగతి శేఖర్, మల్లికార్జునగౌడు పాల్గొన్నారు.

కోసిగిలో పడకేసిన పారిశుధ్యం

● డ్రైనేజీలు నిండి రోడ్డుపైనే మురుగు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు



కోసిగిలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కోసిగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కోసిగిలో పారిశుధ్యం పడకేసింది. కోసిగిలోని సిద్దప్ప పాలెం మారెమ్మదేవాలయం ముఖద్వారం రోడ్డులో డ్రైనేజీ కాలువలు నిండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు, షాపు యజమానులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేయడకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, సర్పంచ్, పంచాయతీ అదికారులు స్పందించి మురగు నీటి డ్రైనేజీలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

న్యాయ సుధ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత



వేద పఠనం చేస్తున్న పీఠాధిపతితోపాటు రాజా ఎస్ గిరిరాజాచార్

మంత్రాలయం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురు సార్వభౌమ సాంస్కృతిక విద్యాపీఠంలో న్యాయ సుధ గ్రంథంలో పఠించిన ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సోమవారం యజ్ఞశాలలో పండితుల ఆధ్వర్యంలో న్యాయసుధ పరీక్ష నిర్వహించారు. ఇందులో శ్రీకరతంత్రి, పీఎస్ రాఘవేంద్ర అనే విద్యార్థులు పాండిత్యంలో పండితులతో పోటీ పడి విజేత లుగా నిలిచారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆశీస్సులు అందజేశారు. కార్యక్ర మంలో బండి స్వామ్యాచార్, పురోహిత్ నరసింహాచార్, గోపాలాచార్, రమేష్‌చార్, గౌతమాచార్, ఆనందతీర్థాచార్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేకర్, మండల కార్యదర్శి మహబుబ్‌బాషా ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఉపాధి పనులకు కూలీలు రాకపోతే రాలేదని, వస్తే కూలీల వేతనం నెలల కొద్ది జాప్యం చేసి, ఉపాధి హామీ పథకాన్ని నిర్వర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు. ఉపాధి కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ,ఏపీవో రాజునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మిరెడ్డి, ఆశోక్, సుధాకర్, రవీంద్ర పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కడితోటకు చెందిన నలుగురిపై పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థలం వివాదంలో పింజరి శేకన్నపై గ్రామానికి చెందిన సమీప బంధువులు పింజరి సలాం, దివాన్‌సాబ్, సక్రమ్మ, సుభాన్ ఆదివారం రాత్రి దాడి చేశారు. ఫిర్యాదుదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.